రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (శనివారం సాయంత్రం)
సహర్: 4:50 (ఆదివారం ఉదయం)



కన్నీటి సాగు

వరి పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్‌తో నీటి తడులు

జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. మూడేళ్లుగా సరిపడా వర్షాలు కురవకపోవడంతో జలవనరుల్లో నీరు లేక, భూగర్భ జలాలు అడుగంటి వరి చేలు నిలువునా ఎండిపోతున్నాయి. యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన ఇటికాల వెంకటరెడ్డికి ఉన్న 12 ఎకరాలకు నాలుగు బోర్లున్నాయి. ఆరు ఎకరాల్లో వరి చేశాడు. ఇప్పటికే రెండు బోరు బావులు వట్టిపోయాయి. దీంతో మూడు ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. మిగిలిన మూడు ఎకరాల వరి పొట్ట దశలో ఉంది. బోర్లలో సరిగా నీరు రాకపోవడంతో పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్‌కు రూ.వెయ్యి చొప్పున రోజుకు ఐదు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసి పంటకు నీరందిస్తున్నాడు. పంట చేతికందే వరకు రూ.65 వేలు ఖర్చవుతుందని వాపోతున్నాడు. కాగా, చిన్నతూండ్ల, మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద తదితర గ్రామాల్లో పదుల ఎకరాల్లో వరి చేలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. యాచారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి)


హిమాయత్‌నగర్‌లో ప్రమాదకరంగా పక్కకు ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్

పొంచి ఉన్న ప్రమాదం

మొయినాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. భూమికి తక్కువ ఎత్తులో నిర్మించిన దిమ్మెలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో సాయిబాబా కాలనీ బండపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె శిథిలావస్థకు చేరి ఒక పక్కకు ఒరిగింది. కూరగాయల మార్కెట్ వద్ద నేలపై వన్‌పేజ్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభానికి తీగలు అడ్డదిడ్డంగా ఉన్నాయి. ప్రధాన రోడ్డు పక్కన ఓ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


హిమాయత్‌నగర్‌లో నేలకు కొద్ది ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

లక్ష్యానికి చేరువలో..

ఆస్తి పన్ను వసూలు.. 86 శాతం పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులకు తోడు.. వివిధ రకాల పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీల ఖజానాలు కళకళలాడుతున్నాయి. మొండి బకాయిలను సైతం వసూలు చేయడంతో ఈ ఏడాది ఖజానాకు భారీగా నిధులు సమకూరాయి. రెండేళ్లుగా పన్ను వసూళ్లపై పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో ఇంటి పన్ను చెల్లింపు విషయంలో పల్లెల్లో చైతన్యం వెల్లివిరిసింది. వంద శాతం పన్నుల వసూలే లక్ష్యంగా అధికారులు ఇంటింటికీ తిరిగి వసూలు చేస్తుండగా కొన్నిచోట్ల స్వచ్ఛందంగా ప్రజలే ముందుకు వచ్చి చెల్లిస్తున్నారు. పన్ను చెల్లింపులో తండావాసులే ముందంజలో ఉన్నారు.

- రూ. 25.31 కోట్లు సేకరించిన అధికారులు
- గతేడాది కంటే పెరిగిన రాబడి
- 145 జీపీల్లో 100% చెల్లింపులు
- ముందు వరుసలో తండాలు


చౌదరిగూడలో పన్ను వసూలు చేస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) గతేడాది కంటే ఈసారి పన్నుల వసూళ్లు పెరిగాయి. ఈనెల 26వ తేదీ వరకు 86 శాతం పన్నులు వసూలయ్యాయి. నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెలాఖరు వరకు పన్ను వసూళ్లు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో 558 గ్రామ పంచాయతీల్లో గతేడాది మొత్తం 32.78 కోట్లు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.26.21 కోట్లు వసూలైంది. 80 శాతం మేర పన్నులు వసూలు చేశారు. ఈసారి 27 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. మిగిలిన 531 గ్రామ పంచాయతీల్లో టాక్స్, నాన్ టాక్స్‌లు

మిగతా 8వ పేజీలో...

పన్నుల వివరాలు

మండలం	జీపీలు	లక్ష్యం(రూ)	వసూలు(రూ.)	శాతం
శంషాబాద్	21	2,02,90,730	1,65,79,608	82
శంకర్‌పల్లి	24	3,68,47,075	3,05,94,975	83
అబ్దుల్లాపూర్‌మెట్	14	2,91,47,585	2,45,63,439	84
ఇబ్రహీంపట్నం	14	1,02,84,453	86,29,918	84
మొయినాబాద్	20	1,55,42,588	1,31,07,481	84
నందిగామ	19	4,09,48,954	3,43,48,478	84
చౌదరిగూడెం	24	48,34,916	41,15,173	85
కడ్తాల్	24	56,46,965	48,04,056	85
కందుకూరు	35	1,65,14,140	1,39,57,411	85
కొత్తూరు	12	98,58,796	83,60,725	85
మంచాల	23	61,72,033	52,69,805	85
షాబాద్	41	1,11,43,375	98,06,828	88
యాచారం	24	1,37,14,721	1,20,07,569	88
చేవెళ్ల	29	1,12,07,812	1,00,20,145	89
ఫరూక్‌నగర్	47	2,21,87,825	1,97,34,319	89
కొందుర్గు	22	89,03,322	79,02,749	89
మహేశ్వరం	30	1,83,22,224	1,63,53,435	89
కేశంపేట్	29	59,78,657	53,81,374	90
ఆమనగల్లు	13	13,77,107	12,96,812	94
మాడ్గుల	34	32,04,526	30,19,955	94
తలకొండపల్లి	32	34,74,001	32,72,992	94
మొత్తం	531	29,56,01,805	25,31,27,247	86


సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

పరిహారం తీసుకొని సాగు చేస్తున్నారు

- ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి
- ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి

కందుకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ కోసం టీజీఐఐసీ ద్వారా భూములకు పరిహారం పొందిన రైతులు అక్కడక్కడా సాగుచేస్తున్నారని, ఆ భూములకు హద్దులు ఏర్పాటు చేసి తీసుకోవాలని కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం మహేశ్వరం అడిషనల్ డీజీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కందుకూరు, యాచారం మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు రెండు మండలాల్లో 12వేల ఎకరాలకు పరిహారం మంజూరు చేసి రైతులకు ఇచ్చినట్లు వెల్లడించారు. కానీ, యాచారం, కందుకూరు మండలాల్లో పరిహారం తీసుకున్న రైతుల్లో కొందరు ఆ భూముల్లో సాగు చేస్తున్నారన్నారు. కందుకూరు మండలంలో 500 ఎకరాలు, యాచారం మండలంలో 2000 ఎకరాలకు సంబంధించి న్యాయస్థానంలో కేసులు ఉన్నట్లు తెలిపారు. తీర్పు వెలుబడిన తర్వాత ఆ భూములను తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు రెండు మండలాల్లో 14,500 ఎకరాలు ఫ్యూచర్ సిటీ కోసం సేకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ఏసీపీలు లక్ష్మీకాంతరెడ్డి, రాజు, కందుకూరు, యాచారం తహసీల్దారు కె.గోపాల్, టి.అయ్యప్ప. కందుకూరు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మ సీఐలు సీతారాం, లక్ష్మీ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై
అవగాహన అవసరం
దాతలు పెరగాలి.. జీవితాలు నిలవాలి

7

పంచాయతీల ఆదాయం పెంచడమే లక్ష్యం

జిల్లా పంచాయతీ అధికారి, సురేశ్‌మోహన్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'పంచాయతీల్లో ఆదాయం పెంచడమే లక్ష్యం. వంద శాతం పన్నులు వసూలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించిన 33 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశాం. 75 శాతం కంటే తక్కువగా పన్ను వసూలు చేసిన కార్యదర్శులపై చర్యలు తీసుకుంటున్నాం. తక్కువ, అతి తక్కువ పన్ను వసూళ్లపై సమీక్షిస్తాం.' అని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ అన్నారు. తడి, పొడి చెత్త ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గాలు, పన్ను వసూళ్లపై 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఆదాయాన్ని పెంచేందుకు ఎలాంటి మార్గాలను ఎంచుకున్నారు?

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా చెత్తను సేకరిస్తున్నాం. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నాం. దీని కోసం తడి, పొడి చెత్తను వేరుచేసేందుకు ఇంటింటికీ చెత్త బుట్టలను అందించాం. సేకరించిన చెత్త ద్వారా ఎరువును తయారు చేసి ఆదాయాన్ని సమకూర్చునేలా చేస్తున్నాం.

పంచాయతీల్లో నిధుల కొరత ఉందా?

నిధుల కొరత ఉంది.. కానీ, పన్నుల రూపంలో దాన్ని పూడ్చే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి టీడీ ఫండ్ వచ్చేది. సినరేజీ నిధులు విడుదలయ్యేవి. ఈ రెండూ రావడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ఆగాయి. ఇటీవల ప్రభుత్వం కొన్ని నిధులు విడుదల చేసింది. ఆ నిధులతో ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించాం.

పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా జీతాలిస్తున్నారా?

ప్రతి నెలా 5వ తేదీలోగా కార్మికులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెల నుంచి కార్మికులందరికీ నేరుగా బ్యాంకులో జీతాలు జమ అవుతాయి. జిల్లాలో 3,016 మంది పారిశుధ్య కార్మికులున్నారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.9,500 చొప్పున రూ.2.96 కోట్లు వేతనాల రూపంలో అందిస్తున్నాం. పంచాయతీలో పనిచేసే 52 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.19,500 చొప్పున రూ.11 లక్షలు చెల్లిస్తున్నాం.

జిల్లాలో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది?

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. కాలనీల్లో చెత్త సేకరణకు వాహనాలు ఇంటింటికీ వెళ్తున్నాయి. వారానికి ఒక రోజు వాటరింగ్ డే, డ్రై డే నిర్వహిస్తున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం.

ఎల్ఆర్ఎస్ అమలు ఎలా ఉంది?

జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు జిల్లాలో 44 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాం. నాలుగు వేలకు పైగా దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. వీటికి సంబంధించి త్వరలో ప్లాట్లు, లేఅవుట్ల యజమానులు ప్రొసీడింగ్స్ అందుకోనున్నారు.

మంత్రి పదవిపై కసిరెడ్డి కన్ను!



ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మంత్రి పదవిపై కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఉగాది తర్వాత కేబినెట్ విస్తరణ ఉంటుందన్న ప్రచారం నేపథ్యంలో మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న కసిరెడ్డి తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా పని చేసిన తనకు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ నేతలను కలిసి అభ్యర్థించినట్లు తెలిసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తారన్న ప్రచారం ఊపందుకుంది. కాగా కసిరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కేఎన్నార్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా ఆధ్వర్యంలో శుక్రవారం ఆమనగల్లులో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

'సహకార' బలోపేతానికి కృషి

- ఉగాది తర్వాత సన్న బియ్యం పంపిణీ
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని, ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నోముల పీఏసీఎస్‌కు రూ.5 లక్షల నిధులతో ప్రహరీ నిర్మాణం, ఆరుట్ల పీఏసీఎస్ ఆవరణలో రూ.50 లక్షలతో చేపట్టిన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కూరగాయల మార్కెట్ ఏర్పాటుతో స్థానిక రైతులకు సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. కొంత ఆలస్యమైనా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, జెనిగె వెంకటేష్ యాదవ్, ఈసీ శేఖర్‌గౌడ్, సాతిరి ఎల్లేష్, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, బొద్రమోని యాదయ్య, చీమల జంగయ్యయాదవ్, జిలమోని సత్తయ్య, శ్రీనివాస్‌నాయక్, వెదిరె సికిందర్‌రెడ్డి, రాఘవ, మార సురేష్, కారింగ్ జంగయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, జనార్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ సీనియర్ అసిస్టెంట్ రమేష్ తహసీల్దారు ప్రసాద్‌రావు పాల్గొన్నారు.


ఆరుట్లలో కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

భక్తిశ్రద్ధలతో జుమాతుల్ విదా



రంజాన్ మాసం చివరి శుక్రవారం నేపథ్యంలో జుమాతుల్ విదా పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆమనగల్లు జామా మజీద్, హైమదే హిలాల్, మహ్మదీయ మజీద్‌లలో జరిగిన వేడుకల్లో మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మాసూమ్, మహ్మద్ గౌస్, ఖాదర్‌ఖాద్రీ పాల్గొన్నారు. కడ్తాల్‌లో ఇమామ్‌లు జహీరొద్దీన్, అక్రమ్, తహజీబ్, వజీప్‌ను సత్కరించారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రాహుప్, అహ్మద్ జాని, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావేద్ పాల్గొన్నారు. ఆమనగల్లు/కడ్తాల్, మార్చి28(ఆంధ్రజ్యోతి)



ఆమనగల్లు పోలీస్ స్టేషన్

ఏసీపీ కార్యాలయం ఏర్పాటెప్పుడో?

- నాలుగు మండలాలతో కలిపి ఏర్పాటుకు నిర్ణయం
- ఏడాదిన్నరగా ప్రతిపాదనలకే పరిమితం

ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈ విషయంలో ఎవరూ చొరవచూపడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇక్కడ ఏసీపీ కార్యాలయాన్ని ప్రతిపాదించారు. కడ్తాలలో పోలీసుస్టేషన్ భవనం ప్రారంభ సందర్భంగా అప్పటి హోంమంత్రి మహమూద్ అలీ, అప్పటి డీజీపీ అంజన్‌కుమార్‌లు ఏసీపీ కార్యాలయాలు ప్రారంభిస్తామని చెప్పారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలతో కార్యాలయ ఏర్పాటు మరుగున పడింది. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాలతో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి పీఎస్‌లు సైబరాబాద్ కమిషనరేట్‌లో, మాడ్గుల స్టేషన్ రాచకొండ పరిధిలో ఉన్నాయి. మాడ్గులను కూడా సైబరాబాద్ పరిధికి మార్చి ఇక్కడ ఏసీపీ కార్యాలయ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇప్పుడు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి షాద్‌నగర్ ఏసీపీ కింద, మాడ్గుల ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో కొనసాగుతున్నాయి. ఒకే నియోజవర్గంలోని నాలుగు మండలాలు రెండు అసిస్టెంట్/కమిషరేట్ల పరిధుల్లో కొనసాగుతుండడంతో పాలనాపర ఇబ్బందులు చోటుచేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులకు కూడా ఇబ్బందికరంగా మారింది. షాదనగర్ ఏసీపీ ఆఫీసు ఆమనగల్లుకు 50కిలోమీటర్లు, ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయం మాడ్గులకు 40కిలో మీటర్ల దూరం ఉంది. ఏదైనా పని కలిగితే అక్కడికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని ఈ మేరకు కృషిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీ మల్లు రవికి కూడా వినతిపత్రమిచ్చారు. ఎంపీ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్లు సమాచారం.

ప్రభుత్వం ప్రక్రియను ప్రారంభించాలి



ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయ ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలకు ఇదే విషయాన్ని విన్నవించాం. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల పోలీస్‌స్టేషన్లతో ఏసీపీ ఆఫీసు ఏర్పాటు చేస్తే శాఖాపరంగా మరిన్ని సేవలు అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు కార్యాలయాలు దూరంగా ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే ప్రకియను ప్రారంభించాలి.

\- గుర్రం కేశవులు, ఆమనగల్లు

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



ఏసీపీ కార్యాలయం, డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. కార్యాలయాల ఏర్పాటుకు ఏళ్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం. ధర్నాలు, దీక్షలు, ఆందోళనలూ చేపట్టాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్యాలయాల ఏర్పాటులో కాలయాపన చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆఫీసులు ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలి.

\- ఎర్రవోలు శ్రీను, ఆమనగల్లు

రాజీవ్ యువ వికాసం పథకానికి

దరఖాస్తు గడువు పెంచాలి

యాలాల, మార్చి28(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథక దరఖాస్తు గడువు ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. శుక్రవారం కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మల్కయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రెండు రోజులు ఉగాది, రంజాన్ పండుగల సెలవులు ఉన్నందున యువత సర్టిఫికెట్లు పొందలేరన్నారు. మీ-సేవల్లో దరఖాస్తు చేసుకుంటే రేషన్‌కార్డు నంబర్ అడుగుతోందని, కొత్త రేషన్ కార్డులు జారీ కానందున స్కీంకు రేషన్ కార్డు నిబంధన తొలగించాలని కోరారు. నిబంధన తొలగించి, సెలవులు దృష్టిలో ఉంచుకొని దరఖాస్తు గడువు పెంచాలని కోరారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు నర్సింహులు, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల నాయకులు కృష్ణ, బీఎస్పీ తాండూరు ఉపాధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, యువకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు





విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

సినీ నటుడు సుమన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, భావితరాల కోసం హైదరాబాద్ టెక్నోస్కూల్ నిరంతరం పని చేయాలని సినీ నటుడు సుమన్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. గురువారం రాత్రి కందుకూరులోని పాఠశాల వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. 16సంవత్సరాల క్రితం పాఠశాలను స్థాపించిన ప్రిన్సిపాల్ ఎన్.రఘురాంరెడ్డి విద్యార్థులు విద్యారంగంలో రాణించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే క్రీడారంగంలో రాణించేలా వారికి చేయుతనందిస్తున్నారని అభినందించారు. అనంతరం యాజమాన్యం పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో నాయకులు జి.నారాయణరెడ్డి, మహేందర్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పదు

మోమిన్‌పేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్ అన్నారు. మేకవనంపల్లి సొసైటీ సీఈవో బాలకృష్ణ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం జేకేఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. బాలకృష్ణ-మల్లమ్మ దంపతులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ అంకిత భావంతో పనిచేసి రైతుల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ రామ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, మోమిన్‌పేట్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వినయ్‌కుమార్, డీసీవో నాగార్జున్, మొహ్మద్, మేనేజర్ నారాయణరెడ్డి, రవీందర్, నరేశ్, సీఈవో బ్రహ్మం, రవీందర్, శేఖర్ పాల్గొన్నారు.



బాలకృష్ణ-మల్లమ్మ దంపతులను సన్మానిస్తున్న రవీందర్‌గౌడ్

మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హనుమంతరెడ్డి



మేడ్చల్ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చీదు హనుమంతరెడ్డి రెండో సారి విజయం సాధించారు. శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవులు, ఇతర పదవులకు ఎన్నికలు నిర్వహించారు. హనుమంతరెడ్డి రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా విజయగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడు వినోద్, జాయింట్ సెక్రటరీ శేఖర్‌గౌడ్, కోశాధికారిగా అఫ్సర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం అహర్నిషలు పాటు పడతానని, మేడ్చల్ కోర్టు అభివృద్ధి కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని హనుమంతరెడ్డి అన్నారు.


హ్యాకథాన్‌లతో నైపుణ్యాల పెంపు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి):హ్యాకథాన్లలో పాల్గొంటే సాంకేతిక నైపుణ్యాలు పెంపొందుతాయని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ నల్ల దివ్య తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, దివ్యనగర్‌లోని కళాశాలలో జరిగిన హ్యాక్ స్ప్రింట్-25 కార్యక్రమం జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి 32కళాశాలల నుంచి ఆర్టిఫిషియల్ ఇం టెలిజెన్స్, మెషిన్‌లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, రొబోటిక్స్, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు రూ.50వేల చొప్పున నగదు, ప్రశంసాపత్రాల ను అందజేశారు. ప్రిన్సిపాల్ రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ రాజశేఖర్, సీఎస్ సీ హెచ్‌వోడీ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





అంగన్‌వాడీ టీచర్లు

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీవో కాంతారావు

తాండూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని తాండూరు సీడీపీవో కాంతారావు అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అదనపు సీడీపీవో శ్రీలక్ష్మితో కలిసి మాట్లాడారు. తాండూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జనన, మరణాల వివరాలన్నీ అంగన్‌వాడీ టీచర్ల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. వేసవిలో కేంద్రాలను మధ్యాహ్నం వరకే కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అలాగే కుండ నీరు, గర్భిణులకు మజ్జిగ ఇవ్వాలని ఆదేశించామన్నారు. సిబ్బంది పిల్లల బరువు, ఆహారం నిల్వలు, ప్రీ స్కూల్ తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సుధాకర్‌గౌడ్, సుభాన్‌రెడ్డి



చేవెళ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మల్లాని సుధాకర్‌గౌడ్, బానోరు సుభాన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రైతు సంఘం మూడో మహా సభలు నిజామాబాద్‌లో ఈ నెల 25, 26, 27తేదీల్లో జరిగాయి. ఈ మహసభలో చేవెళ్ల మండలానికి చెందిన సుధాకర్ గౌడ్, సుభాన్‌రెడ్డిలు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నియ్యారు. వారు చేవెళ్లలో మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తామన్నారు. వారికి చేవెళ్ల మండల సీపీఐ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలి



పరిగి మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

పరిగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దేశంలో వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం పరిగిలో మసీదు వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ముస్లింకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బిల్లును వెనక్కి తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం దీనిని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ లావణ్య

శంకర్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పరిధి సింగాపూర్ పాతబడిన అంగన్‌వాడీ సెంటర్‌ను సొంతంగా రూ.లక్షతో మరమ్మతులుచేయించి శుక్రవారం పునఃప్రారంభించారు. పాపిరెడ్డి, రాజిరెడ్డి, శేఖర్‌రెడ్డి,శంకరయ్య, సురేందర్‌రెడ్డి, ప్రతాప్, సురేష్, టీచర్ రుకియా ఉన్నారు.

మహిళా ఉపాధే 'ఐక్యత' ధ్యేయం

ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడం ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కడ్తాల మండలాలకు చెందిన 35 మంది మహిళలకు శుక్రవారం ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించారు. వారికి రాఘవేందర్‌రెడ్డి, కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో 132మంది మహిళలకు ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, రవియాదవ్, ఝాన్సి,గంగ, అభినవ్‌రెడ్డి, కొండల్, పాల్గొన్నారు.



మహిళలు,యువతులతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

అవయవదానంపై అవగాహన అవసరం

దాతలు పెరగాలి.. జీవితాలు నిలవాలి ● ప్రచారం లేక ఆసక్తి చూపని మృతుల కుటుంబీకులు

ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మనిషి శారీకంగా మరణించినా శరీరంలోని వివిధ అవయవాలతో జీవించేలా చేసేది అవయవ దానం. నలుగురు ఆపన్నుల జీవితాల్లో వెలుగులు నింపే ఈ మహత్తర కార్యక్రమానికి సమాజంలో ప్రోత్సాహం కరువైంది. మూఢ నమ్మకాలు, అపోహలు, అవగాహన లేక ఎవరైనా చనిపోయినా, బ్రెయిన్‌డెడ్ అయిన సందర్భాల్లో అవయవ(ఆర్గాన్స్) దానాలకు ఆసక్తి చూపడం లేదు. రక్త, నేత్ర దానాలపై ప్రజలకు అవగాహన ఉన్నా.. మిగిలిన అవయవ దానాలపై కొన్ని సందర్భాల్లో తప్పితే పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు.

మరణించినా జీవించగలిగే అవకాశం..

మనిషి మరణించినా జీవించినట్లు అనుభూతిని కల్గించేది అవయవ దానం. మరణానంతరం మనిషి శరీరంలోని 200ఆర్గాన్లు, టిష్యూలను దానంచేసే అవకాశం ఉంది. కళ్లు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరి తిత్తులు, క్లోమం, పెద్ద/చిన్నపేగులు, ఎముకలు, మూలుగ ఇలా వివిధ అవయవాలను దానం చేయొచ్చు. ఒక వ్యక్తి మరణానంతరం వైద్యపరంగా అవసరమున్న వారిలో సగటున ఆరేడుగురికి నూతన జీవితాన్నివ్వొచ్చు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి. సమాజంలో నేటికీ మూఢాచారాలు పోలేదు. విద్యావంతులు సైతం అపోహలు వీడడం లేదు. ఆ దిశగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ఆస్పత్రులు చొరవ చూపాల్సి ఉంది.

డోనర్లు ఎవరంటే...

అవసరం ఉంటే బతికుండగానే రక్త సంబంధీకులకు అవయవ దానాలు చేయొచ్చు. వీరిలో తల్లి, తండ్రి, సోదరి, సోదరుడు, కూతురు, కొడుకు, భార్య వస్తారు. బతికుండగా ఇతరులకు అవయవదానం చేయాలంటే ప్రభుత్వ అనుమతి పొందాలి. ఆరోగ్యవంతులైన మేజర్లు అవయవదానాలకు అర్హులు. మరణానంతరం మాత్రం వైద్యపరంగా ఉపయోగపడే శరీరంలోని ఏ భాగాన్నైనా డొనేట్ చేసేందుకు సమ్మతివ్వొచ్చు. ఈ విషయంలో వయసుతో సంబంధం లేదు. అవయదానానికి ముందుకొచ్చే వారు మోహన్ ఫౌండేషన్, జీవన్‌దాన్, ప్రభుత్వాస్పత్రులు, కంటి వైద్యశాలలు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను సంప్రదించొచ్చు. రక్తదానం బ్లడ్ బ్యాంకుల్లో చేయొచ్చు.



రక్తదానం చేస్తున్న యువకులు(ఫైల్)

ఏ సమయాల్లో అవయువాలను సేకరించాలి?

మనిషి మరణానంతరం అవయవ సేకరణ అనేది గంటల్లో జరిగిపోవాలి. గుండె ఆగి చనిపోతే కల్లు, గుండె కవాటాల సేకరణ 6 నుంచి 24గంటల్లోపు చేయాలి. బ్రెయిన్‌డెడ్ పేషెంట్‌ను వెంటిలేటర్ నుంచి తీసుకొచ్చేలోపు అవయవాలను సేకరించాలి. సేకరించిన అవయవాన్ని బట్టి 5నుంచి 24 గంటల్లోపు అవసరమైన వారికి అమర్చాలి. ఇదంతా రిస్క్, ఖర్చుతో కూడుకున్నదే అయినా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, పెరిగిన వసతుల నేపథ్యంలో వైద్యులు చాలా మంది రోగులకు అవయవ మార్పిడి చేస్తున్నారు. ఇదంతా పెద్దాస్పత్రుల్లోనే సాధ్యం. అయితే అవయవాల కోసం వేల మంది రోగులు ఎదురుచూస్తోంటే.. దాతల సంఖ్య పదుల్లో ఉంది. మరణించిన మనిషి అవయవాలను సేకరించకుండా అంత్యక్రియలు చేస్తే అవన్నీ వృథా అవుతాయి. దీనిపై ప్రజల్లో అవగాహన లేక ఈ సమస్య తలెత్తుతోంది. నేత్రదానంపై ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ప్రచారం చేస్తోంది. పదేళ్లలో క్లబ్ ద్వారా పది మంది నేత్రాలు సేకరించారు. సదస్సులు నిర్వహిస్తూ మరణానంతరం నేత్రదానానికి అంగీకార ప్రతాలను సేకరిస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

విద్యావంతులు చైతన్యం తేవాలి



అవయవ దానాలపై ప్రజలు అపోహలు వీడాలి. ఈ విషయంలో విద్యావంతులు ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి. మృతుల అవయవదానాలపై వారి కుటుంబీకులు ముందుకొస్తే అవసరమున్న వారికి పునర్జన్మ ప్రసాదించినట్లే!

- డాక్టర్ నాగరాజు, ఆమనగల్లు

ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి



ఒకరి నేత్ర దానంతో ఇద్దరు అంధులకు దృష్టిభాగ్యం కలుగుతుంది. నేత్ర దానంపై అవగాహన లేక చాలా మంది ముందుకు రావడం లేదు. ప్రమాదాల్లో మరణించిన వారి నేత్రాలను కూడా సేకరించలేకపోవడం దురదృష్టకరం. ప్రజా చైతన్యంతోనే ఆశించిన ఫలితాలు వస్తాయి.

- చంద్రశేఖర్, నేత్ర వైద్యుడు

మూఢాచారాలు వీడాలి



రోడ్డు ప్రమాదాల్లో, సహజంగా మరణిస్తున్న వారి కుటుంబీకులు అవయవ దానాలకు ముందుకు రావాలి. అపోహల తొలగింపునకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు కృషిచేయాలి. ప్రజలు మూఢాచారాలు వీడాలి.

ప్రమోద్‌కుమార్, సీఐ, ఆమనగల్లు

విస్తృత ప్రచారం చేస్తున్నాం



నేత్ర, రక్త, అవయవ దానాలపై 20ఏళ్లుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. లయన్స్ క్లబ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నేత్ర, రక్తదానంపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. క్లబ్ ద్వారా సేకరించిన కళ్లను ఎల్వీ ప్రసాద్, ఎస్‌వీఎస్, సరోజిని దేవి ఆస్పత్రులకు అందజేశాం. పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఎంఏ.పాషా, పీఆర్వో, లయన్స్ క్లబ్, ఆమనగల్లు



ఇంటి యజమాని నుంచి చెక్కును తీసుకుంటున్న డీపీవో, ఎంపీడీవో

పన్ను వసూళ్లను నిర్లక్ష్యం చేయొద్దు

శంకర్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చేస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ హెచ్చరించారు. మోకిలలోని ఓ విల్లాలో ఆయన ఎంపీడీవో వెంకయగౌడ్‌తో కలిసి శుక్రవారం ఇంటింటికి తిరిగారు. ఇంటి పన్ను చెల్లిచాలని విల్లాల యజమానులను కోరారు. అనంతరం మాట్లాడుతూ.. 100 శాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. పన్ను చెల్లించని ఇంటి యజమానులకు జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేరుచేయడంతో పాటు ప్లాస్టిక్‌ను వాడరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిరాజ్, మోకిల పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య ఉన్నారు.

ప్రతీ గ్రామంలో టీడీపీ జెండా ఎగరాలి

మొయినాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మార్చి 29వ తేదీ శనివారం నాటికి తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 సంత్సరాలు పూర్తి అవుతోందని, ఈ తరుణంలో నేడు ప్రతి గ్రామంలో టీడీపీ జెండాను ఎగరేయాలని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, పొలిట్‌బ్యూరో మెంబర్ బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం మొయినాబాద్ పరిధి హిమాయత్‌నగర్ చౌరస్తాలో టీడీపీ దిమ్మెకు పసుపు రంగు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. టీడీపీ పుట్టిందే బీసీల అభ్యున్నతికి అని, యువతను రాజకీయాల్లోకి తేవాలనే ఎన్టీరామారావు పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ తలకోటి హరికృష్ణ, మండల ఇన్‌చార్జి యాదయ్యగౌడ్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ దిమ్మెకు రంగువేస్తున్న బక్కని నర్సింహులు

రోడ్డు దుస్థితి ఎవరికీ పట్టదా?

మొయినాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధి చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు పనులు మధ్యలోనే నిలిపివేయడంతో వాహనదారుల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. ఈ మట్టి రోడ్డును గత ప్రభుత్వంలో బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.2.5కోట్లతో పనులను చేపట్టారు. కంకర వేసి పనులను ఆపేశారు. ఈ రోడ్డుపై వాహనాలు వెళ్తే లేస్తున్న దుమ్ముతో సమీప ప్రాంతమంతా కప్పేస్తోంది. రోడ్డు పక్కనున్న పంటలను దుమ్ము కమ్మేసి దిగుబడి రావడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే రోడ్డు పనులను పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు దుస్థితి



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

లాభాల బాటలో ధారూరు సొసైటీ

ధారూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎరువుల అమ్మకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో వ్యవసాయ పరపతి సంఘం లాభాలార్జించిందని ధారూరు ప్యాక్స్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది రూ.44లక్షల ఆదాయమొచ్చిందని చెప్పారు. రైతులు తసుకున్న రుణాలను వెంటనే చెల్లించాలని కోరారు. రూ.10.50కోట్ల దీర్ఘకాలిక రుణాలుండగా రూ.3కోట్లే వసూలయ్యాయని చెప్పారు. రైతులు తమ బకాయిలను ఈ నెల 31లోగా చెల్లించాలని కోరారు. బంగారం తాకట్టుపై రూ.5.64 కోట్ల రుణాలు ఇచ్చామని చెప్పారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, సీఈవో కె.నర్సింహులు, డైరెక్టర్లు ఎం.శివకుమార్, కరీం, పి.రవీందర్, టి.గోపాల్‌రెడ్డి, మల్లమ్మ, కె.గోపాల్‌రెడ్డి, తుల్జానాయక్, రైతులు పాల్గొన్నారు.

రూ.150కోట్ల రాయల్టీ వసూలు చేయాలి

- మైన్స్ అధికారులకు పెరిగిన ఒత్తిడి
- చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు

తాండూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాయల్టీ వసూళ్లలో మైన్స్ అధికారులపై ఒత్తిడి పెరిగింది. దీంతో అధికారులు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు విస్తృతం చేశారు. తెలంగాణ సరిహద్దు గ్రామాలు, కర్ణాటక సరిహద్దు గ్రామమైన మిర్యాణ్ తదితర ప్రాంతాల్లో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. ఈ గనులతోపాటు తాండూరు నియోజకవర్గ పరిధిలో ఎర్రమట్టి, సుద్ద గనులు కూడా ఉండటంతో గనుల శాఖకు ప్రభుత్వం 2024-25ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలుపై లక్ష్యం విధించింది. మార్చి ఆఖరులోగా రాయల్టీ కింద రూ.150 కోట్ల ఆదాయం వసూలు చేయాలని నిర్దేశించింది. దీంతో మైనింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ తన బృందంతో పగలు, రాత్రి తేడా లేకుండా తాండూరు మండల పరిధి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఇటీవలే రాయల్టీ లేకుండా వెళ్తున్న 11 లారీల యజమానులకు రూ.లక్షపైనే పెనాల్టీ విధించారు. నాపరాతి వ్యాపారం అంతంత మాత్రంగా ఉండటంతో నిబంధలు ఎత్తేయాలని వ్యాపారులు కోరుతున్నారు. ఈ నెలాఖరు వరకు రాయల్టీ లేనిదే లారీ చెక్‌పోస్టు దాటనివ్వం అని అధికారులు చెబుతున్నారు. లక్ష్యం రూ.150కోట్లకు ప్రస్తుతం రూ.128కోట్లు వసూలు చేశామని, మరో రెండు రోజుల్లో టార్గెట్ పూర్తికి కృషి చేస్తామని తెలిపారు. గతేడాది ఈ సమయానికి రూ.120కోట్లు వసూలు చేయగా, ప్రస్తుతం రూ.8కోట్లు అదనంగా వసూలు చేసినట్లు తెలిపారు.

4 నుంచి అన్నాస్‌పల్లిలో విత్తనాల పండుగ

కడ్తాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నాస్‌పల్లి గ్రామ సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు కౌన్సిల్ ఫర్‌గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో విత్తనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ చైర్మన్ కోర్పోలు లీలాలక్ష్మారెడ్డి తెలిపారు. హరిత విప్లవ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి రైతులు, విత్తన విక్రయదారులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల దేశీయ విత్తనాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరవుతారని లీలాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కడ్తాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు శుక్రవారం పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. తమ పదవీ కాలంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందిస్తలేదని పోస్టుకార్డుల నిరసనకు దిగారు. మండల కేంద్రాల నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి కార్డులు పోస్ట్ చేస్తున్నారు. కడ్తాలలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు కార్డులను పోస్ట్ చేశారు. బిల్లులివ్వాలని ఏడాదిన్నరగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పనుల కోసం చేసిన అప్పులతో మాజీ సర్పంచ్‌లు కష్టాలు పడుతున్నారని చెప్పారు. బిల్లులు చెల్లించే వరకూ పోరాటం చేస్తామన్నారు. విశ్వ సుందరి పోటీల నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లులకు డబ్బుల్లేవా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వెంకటేశ్, తులసీరామ్, యాదయ్య, భాగ్యమ్మ, లోక్య, సులోచనసాయిలు, మంజులచంద్రమౌళి, ప్రియరమేశ్, వీరయ్య, నర్సింహ, రామకృష్ణ, వినోద్, గోపాల్, లాయక్ అలీ, రామచంద్రయ్య గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లులో సీఎంకు పోస్టు కార్డులు పోస్టు చేశారు. మాజీ సర్పంచ్ లు పోస్టాఫీస్ వద్ద సీఎంకు పోస్టు కార్డులను పంపారు. లక్ష్మణ్, సోనశ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డులను బాక్స్‌లో వేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు

బిల్లుల కోసం పోస్టుకార్డు ఉద్యమం

ఇబ్రహీంపట్నం: మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ రాయపోల్ మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంతరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డు పంపారు. చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్రస్థాయి పోస్టుకార్డు ఉద్యమం చేపట్టాని చెప్పారు. 16నెలలుగా బిల్లులు రాక మనోవేదనకు గురవుతున్నామన్నారు. పలు మార్లు నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

సింహవాహనంపై స్వామివారు

- శ్రీ వేంకటేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు

కొడంగల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు సింహ వాహనంపై కల్కి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.





పురస్కారాలు అందుకుంటున్న సెయింట్ పీటర్స్ అధ్యాపకులు

పురస్కారం లభించడం గొప్ప విషయం

మేడ్చల్ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష సంస్థ ఇస్రోకు చెందిన భారతీయ దూర సంపర్క సంస్థ(ఐఐఆర్ఎస్) నిర్వహించిన అవుట్ రీచ్ కార్యక్రమంలో ప్రతిభ చూపడం అభినందనీయమని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి అన్నారు. జీఐఎస్, జీఎన్ఎస్ఎస్, జియో స్పేషియల్ టెక్నాలజీస్ వంటి అంశాలపై నిర్వహించిన కార్యక్రమంలో మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చడంతో సంస్థవారు ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల యాజమాన్యం శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. టీవీ.రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకులు కళాశాలకు ప్రత్యేక గుర్తింపును తెచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ పాల్గొన్నారు.

ఏఐపై పట్టు సాధించాలి

మేడ్చల్ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌పై విద్యార్థులు పట్టుసాధిస్తేనే సాంకేతిక రంగంలో రాణిస్తారని టీఎస్ఎస్‌హెచ్ఈ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని కిష్టాపూర్ ఎంఆర్ఈఎం కళాశాల వార్షికోత్సవాలను పురస్కరించుకొని టెక్నికల్, నాన్‌టెక్నికల్ ఈవెంట్ ముగింపు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్య ప్రపంచ భవిష్యత్తును మార్చే ప్రమాణమన్నారు. ప్రపంచ గమనాన్ని, దిశన మార్చే శక్తి ఇంజినీరింగ్‌కే ఉందన్నారు. విద్యార్థులు కొత్త కోర్సులపై దృష్టి పట్టు సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూనే సమాజ సేవకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కల్నల్ సి.నరేందర్‌రెడ్డి, సలహాదారులు సత్యనారాయణ, కాలేజీ కార్యదర్శి వి. కృష్ణారెడ్డి, సుబ్బరత్నం, రాఘవేందర్‌రెడ్డి, భరత్‌సింహారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలక్రిష్ణారెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజలకు రాజ్యాంగమే రక్ష

కీసర రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు రాజ్యాంగమే రక్ష అని మేడ్చల్ నియోజకవర్గ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడలోని తిరుమల గార్డెన్‌లో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముప్ప రామారావు ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్, జై జగత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సాధన కోసం కృషిచేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. దేశాన్ని దిగుమతుల నుంచి ఎగుమతుల స్థాయికి చేర్చిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ప్రజల అభివృద్ధికి, సమన్యాయ సాధన కోసం రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని అవహేళన చేసేలా ప్రవర్తిస్తున్నాయన్నారు. మనుధర్మం, సనాతన ధర్మం అంటూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందు ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్, శ్రీలత, మేడ్చల్ ఏఎంసీ డైరెక్టర్ శ్వేత, పార్టీ మండల అధ్యక్షుడు క్రిష్ణయాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు బలమణి, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, జూపల్లి శోభారాణి, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరిగౌడ్, అభిలాష్, రవి, గోవిదింగ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

మహేశ్వరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాజు అన్నారు. శుక్రవారం మహేశ్వరంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో మహాసభలు నిర్వహిస్తామని, అన్ని మండలాల కార్మికులు కార్మికులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. మహిళా కార్మికులకు లేబర్ అడ్డాల వద్ద కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. జేఏసీ చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 143వ రోజుకు చేరాయి. నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్రాంరెడ్డి

రైతుల అభ్యున్నతే సొసైటీ లక్ష్యం

బషీరాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే లక్ష్యంగా సహకార సొసైటీ ద్వారా సేవలందిస్తున్నామని నవాంద్గీ ప్యాక్స్ చైర్మన్ ఎ.వెంకట్రాంరెడ్డి అన్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో సీఈవో బందెయ్యగౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సొసైటీ ఆదాయ, వ్యయాలు, లావాదేవీలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మట్లాడుతూ.. సొసైటీ రైతులకు అన్ని రకాల సేవలందిస్తూ రూ.1.2కోట్ల లాభాల్లో ఉందన్నారు. పంట, దీర్ఘకాలిక రుణాలతో పాటు బంగారంపై లోన్లు ఇస్తున్నామన్నారు. ఎరువులు, సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైస్‌మిల్లు, గోదాం పనులు పూర్తి అవుతున్నాయన్నారు. పెట్రోల్ బంకు నిర్వహణకు ఎన్వోసీ రావాల్సి ఉందని చెప్పారు. కాశింపూర్‌లో కొత్త సొసైటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపుతామన్నారు. భవనం పై మీటింగ్ హాల్, గెస్ట్ రూం నిర్మాణానికి తీర్మానించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, డైరెక్టర్లు అశోక్‌గౌతంచంద్ర, బి.శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, హన్మంతరెడ్డి, గోపాల్, పి.నవీన్‌రెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, అనసూయబాయి, సిబ్బంది వెంకటయ్య, రాజశేఖర్, ఫారూఖ్, తుకారం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్, కొత్తూర్ పీఎస్

ఫటా ఫట్

కొత్తూర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. 44వ నెంబర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు సంభవిస్తూ ఎందరో అమాయకులు మృత్యువాత పడుతుండగా, పలువురు విగతజీవులుగా మారారు. తిమ్మాపూర్ వద్ద గత మంగళవారం రాత్రి స్కూటీపై వెళ్తున్న భార్యాభర్తలను వెనుకనుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన పలువుర్ని కలిచివేసింది. ఈమేరకు ప్రమాదాల నివారణకై ఇన్‌స్పెక్టర్ నర్సింహారావుతో 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రోడ్డు ప్రమాదాల నివారణకు క్రైం, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టాం. వాహనచోదకులు జంక్షన్ల వద్ద, రోడ్డు మళ్లేటప్పుడు ఇండికేటర్లు వేసుకొని నెమ్మదిగా మళ్లాలి. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు తప్పక హెల్మెట్ ధరించాలి. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: జంక్షన్ల వద్ద ప్రమాదాలపై ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశాం. రాత్రి సమయాల్లో వాహనచోదకుల కోసం ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: వాహనాల వేగానికి ఏ విధంగా కళ్లెం వేస్తున్నారు?

జవాబు: వాహనాల స్పీడ్‌ను గుర్తించేందుకు అక్కడక్కడా స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేశాం. వేగంగా వెళితే జరిమానాలు విధిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: కొత్తూర్ అండర్‌పాస్ వద్ద ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు అండర్‌పాస్ ద్వారా వెళ్లాలంటే పాపిరస్‌పోర్టు రిసార్టు పక్కనుంచి కిందకు దిగాలి. అక్కడ సూచికబోర్డులు కూడ ఏర్పాటు చేశాం. వేగాన్ని తగ్గించుకుని వెళ్లాలి. అండర్‌పాస్ వన్‌వే... వాహనాలు రాంగ్‌రూట్‌గా వెళితే జరిమానాలు విధించి, సీజ్ చేస్తాం.

లక్ష్యానికి చేరువలో..

(5వ పేజీ తరువాయి)

కలిపి మొత్తం రూ.29.56 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఈనెల 26వ తేదీ వరకు 25.31 కోట్లు వసూలు చేశారు. 86 శాతం మేర పన్నులు వసూలయ్యాయి. ఇంకా రూ.4.24 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మరో మూడు రోజులు పన్నుల వసూళ్లకు సమయం ఉండటంతో ఆలోగా మిగిలిన పన్నుల బకాయిలన్నీ వసూలు చేసేందుకు పంచాయతీ అధికారులు కృషి చేస్తున్నారు.

గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ల వివరాలు

	2022	2023	2024	2025
పన్నుల వసూళ్ల లక్ష్యం	రూ. 26,72,82,468	28,93,66,972	32,78,15,956	29,56,01,805
వసూలైన పన్నులు	రూ. 24,22,07,458	27,04,96,052	26,21,80,576	25,31,27,247
శాతం	98	96	80	86

వంద శాతం వసూలు చేస్తాం

జిల్లాలో 531 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 86 శాతం పన్ను వసూలైంది. వంద శాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నాం. కొన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు మూత పడ్డాయి. వాటిపై పన్ను బకాయిలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కూల్చి వేశారు. ఆ ఇళ్లపై పన్ను చూపిస్తుంది. అలాగే కొన్ని చోట్ల బేస్‌మెట్‌లకు కూడా ఇంటి నంబర్ అలాట్ చేశారు. వాటిపై పన్ను చూపిస్తుంది. ఇలాంటి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- నురేశ్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి

మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'



కందుకూరు : నేదునూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

షాబాద్/శంషాబాద్/కందుకూరు/షాద్‌నగర్ అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శుక్రవారం షాబాద్‌లో పహిల్వాన్‌షావలి దర్గాలో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, తహసీల్దార్ అన్వర్, ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, డీటీ మధు, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ అక్తర్‌పాష, మత గు రువు చెన్నాబాయి, నాయకులు తదితరులున్నా రు. ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అ న్నారు. శంషాబాద్‌లోని వైఎస్‌ఆర్ గార్డెన్‌లో ఏ ర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక నాయకులు రఫీఖ్, జాంగీర్ ఖాన్, ఆర్.గణేశ్‌గుప్తా, దూడల వెంకటేష్‌గౌడ్, మేకల వెంకటేష్, వై.కుమార్ తదితరులు హాజరయ్యారు. రంజాన్‌ను పురస్కరించుకొని చివరి శుక్రవారం కందుకూరు మండలం నేదునూరులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎండీ అఫ్జల్‌బేగ్, ఎండీ నిజాముద్దీన్, ఇబ్రహీం, మున్వర్, పర్వేజ్, తదితరులున్నారు. మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో ఆర్డీవో సరిత ఆధ్వర్యంలో జరిగి న ఇఫ్తార్ విందుకు హాజరై శంకర్ మాట్లాడుతూ ఇఫ్తార్‌లు మతసామరస్యానికి చిహ్నంగా నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, కృష్ణారెడ్డి, సయ్యద్‌సాదిక్, ఇబ్రహీం, జమ్మీద్‌ఖాన్, ఆసద్, సర్వర్‌పాష పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడు దుర్మరణం

నందిగామ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. నందిగామ మండల కేంద్రానికి చెందిన చెన్నగళ్ల నరేష్(30) గురువారం రాత్రి మండల కేంద్రంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా.. గుర్తుతెలియని రైలు ఢీకొని మృతిచెందినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్తులు మృతదేహాన్ని చూసి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మృతుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ శ్రీనివాస్ తెలిపారు.

బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

మాడ్గుల, మార్చి 28ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తాటికోలు శ్రీశైలం గురువారం వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తుండగా బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. సీఐ వేణుగోపాల్‌రావు కథనం మేరకు.. మాడ్గుల మండల కేంద్రానికి చెందిన తాటికోలు శ్రీశైలం పొలం నుంచి మాడ్గులకు వస్తుండగా కలకొండ రోడ్డు వద్ద వెనకాల నుంచి ఓర్సు సురేష్ అనే ద్విచక్రవాహనదారుడు తన బైక్‌తో ఢీకొన్నాడు. దాంతో శ్రీశైలం తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. శ్రీశైలం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వ్యక్తి అదృశ్యం



రవి(ఫైల్)

యాచారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పిల్లి రవి, లావణ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. రవి వివాహాది శుభకార్యాలకు డెకరేషన్ పని చేస్తుంటాడు. ఈనెల 24న దంపతులు గొడవ పడ్డారు. కలత చెందిన రవి అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు దుకాణం వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి ఇంటికి రాకపోవడంతో శుక్రవారం రాత్రి లావణ్య ఫిర్యాదు చేయడంతో కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చేవెళ్ల : లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/మొయినాబాద్/షాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. అలాగే మొయినాబాద్ మండల కేంద్రంలో పలువురికి చెక్కులను అందించారు. తహసీల్దార్లు కృష్ణయ్య, గౌతమ్‌కుమార్, ఎంపీడీవో సంధ్య, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, జంగయ్య, డైరెక్టర్లు పాండుయాదవ్, జనార్దన్, సత్యనారాయణ, రమేశ్, రాజుగౌడ్, మహేందర్, సీనియర్ నాయకులు బండారు ఆగిరెడ్డి, వసంతం, పార్టీ మండలాధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మాణెయ్య, మాజీ సర్పంచ్‌లు బండారు శైలజాఆగిరెడ్డి, డి. గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. అలాగే షాబాద్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. 42 మందికి సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, తహసీల్దార్ అన్వర్, డీటీ మధు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా దారిని కబ్జా నుంచి విడిపించాలి

షాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈద్గా దారిని ఆక్రమించి ప్రీకాస్ట్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని షాబాద్ మైనార్టీలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ షాబాద్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 3 నుంచి ఈద్గాకు తాతల కాలం నుంచి వెళ్లేవారమని, ఈమధ్య కొందరు అక్రమంగా ప్రీకాస్ట్ వేసి కబ్జా చేశారని ఆరోపించారు. మతీన్, అస్మత్‌పాషా, మాజిద్, తదితరులున్నారు.

పేదల భూమిని కాపాడాలి

నందిగామ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ శుక్రవారం వీర్లపల్లి గ్రామస్తులు తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రమిచ్చారు. గ్రామ శివారు సర్వే నెంబర్లు 152, 153లో 3ఎకరాల లావణి పట్టా భూమిని గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిందని, ఆ భూమి పక్కనే లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు పొలం ఉండడంతో కబ్జా చేసి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన కావాలి.. లక్ష్మమ్మతో పాటు కుటుంబసభ్యులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. చంద్రశేఖర్ గౌడ్, నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



షాద్‌నగర్ : చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాలకు చెందిన 218మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.2.18 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులందజేశారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సూచించారు. షాద్‌నగర్ మున్సిపల్ పట్టణ కార్యాలయంలో కమిషనర్ సునీత అధ్యక్షతన మున్సిపాలిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండలు మరింత ముదరకముందే తాగునీటి వనరులను మరింత పటిష్ట పర్చుకోవాలని కమిషనర్‌కు సూచించారు. కాలనీలో బోర్లు రిపేరు చేయించి వినియోగంలోకి తేవాలన్నారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. డ్రైనేజీ సమస్యపై స్పందించాలని, పారిశుధ్యం, వీధిలైట్లు, దోమల నివారణ కోసం ఫాగింగ్ లాంటి పనుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. పట్టణ మున్సిపాలిటీకి మరో 10రోజుల్లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు సమకూరే అవకాశం ఉందని, నిధులు మంజూరు కాగానే పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు.

'వక్ఫ్' సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



చౌదరిగూడ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లింలు

చౌదరిగూడ/చేవెళ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మజీద్ కమిటీ సభ్యులు తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వక్ఫ్ చట్టానికి సవరణ చేయడం సరికాదని చేవెళ్ల మజీద్ కమిటీ సభ్యులు అక్బర్, లియాఖత్, రఫీ, సమీరొద్దీన్, అజహర్, మోసిన్, తదితరులు అభిప్రాయపడ్డారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని మజీద్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

విధుల పట్ల అలసత్వం తగదు : ఏసీపీ

చౌదరిగూడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. శుక్రవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్‌లను సందర్శించి రికార్డులను పరిశీలించారు. నేరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేపట్టాలని, న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని, తదితర సూచనలు చేశారు. షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, కొందుర్గు ఎస్సై రవీందర్‌నాయక్, జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ పాల్గొన్నారు.

గిరిజనుల సంబురాలు

- గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చాలనే తీర్మానంపై హర్షం

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): లంబాడాలు, బంజారాలు మాట్లాడే గోర్‌బోలి బాషను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడాన్ని హర్షిస్తూ ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, గిరిజన నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్, సీఎం రేవంత్, ఎమ్మెల్యే కసిరెడ్డిలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ చౌక్ వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్‌పతినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో గిరిజన నేతలు, కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీఎం, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్‌పతినాయక్, జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్ : గోర్‌బోలిని 8వ షెడ్యూల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయించిన సీఎం రేవంత్‌కు గిరిజనులు రుణపడి ఉంటారని గిరిజన ఆదివాసీ నాయకు లు రఘునాయక్, శ్రీనునాయక్‌లు అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో సీఎం, మంత్రి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే శంకర్, ట్రైకా చైర్మన్ బెల్లయ్యనాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గిరిజన సంఘాల నాయకులు శక్రునాయక్, బాలునాయక్, మోహన్‌నాయక్, వేణునాయక్, ప్రేమ్‌నాయక్, గణేష్‌నాయక్, సుమన్‌నాయక్, సంతోష్‌నాయక్, శంకర్‌నాయక్ తదితరులున్నారు.



ఆమనగల్లు : సీఎం చిత్రపటానికి నాయకుల పాలాభిషేకం

రుణాలను సకాలంలో చెల్లించాలి



శంషాబాద్ రూరల్ : మాట్లాడుతున్న చైర్మన్ సతీశ్

శంషాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతులు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మల్కారంలో మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట రుణాలు రూ.98లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.4కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సహకార సంఘం ఉపాధ్యక్షుడు ప్రభుసాగర్, పాలకవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

వాణిజ్య రుణాలతో పీఏసీఎస్ అభివృద్ధి

షాద్‌నగర్ అర్బన్ : వ్యవసాయ రుణాలతో పాటు వ్యవసాయేతర రుణాలైన వాణిజ్య రుణాలు ఇవ్వడంతో పీఏసీఎస్ అభివృద్ధి చెందిందని షాద్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్ తెలిపారు. షాద్‌నగర్ పీఏసీఎస్ మహాజన సభ శుక్రవారం జరిగింది. బక్కన్న మాట్లాడుతూ షాద్‌నగర్ పీఏసీఎస్ గత మూడు సంవత్సరాల్లో రూ.3కోట్ల నుంచి రూ.15కోట్ల వ్యాపారానికి అభివృద్ధి చెందిందని తెలిపారు. రైతులు, వ్యాపారులు, చిన్న పారిశ్రామికవేత్తలు పీఏసీఎస్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలకవర్గ సభ్యులు పాండురంగారెడ్డి, బాబునాయక్, ఎన్.శ్రీనివాసులు, శివరాజ్‌గౌడ్, ఎస్, మల్లయ్య, చెన్నకేశవులు, ఉమాదేవి, మణెమ్మ, జగదీశ్వర్, సీఈవో రఘునందన్ తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమల గిరి సురేందర్ , బాలలక్ష్మి శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీలో పర్యటిస్తున్నట్లు తహసీల్దార్ లలిత చెప్పారు. శ్రీనివాస కాలనీలో వీరముష్టి(వీరభద్రయ్య) సామాజికవర్గం జీవన స్థితిగతులను కమీషన్ చైర్మన్, సభ్యులు అధ్యయనం చేస్తారన్నారు.

చౌదరిగూడ : మానవ అక్రమ రవాణాను అరికట్టాడానికి కలిసికట్టుగా పనిచేయాలని ఏపీఎం నర్సింహ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మహిళా సమాఖ్య భవనంలో సీసీలు, మహిళా సమాఖ్య గ్రూప్ లీడర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అత్యవసర సమయంలో 1930, 100,104, 1098, 181 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

కందుకూరు : నేదునూరు ఉన్నత పాఠశాలలో అనాథ విద్యార్థులకు స్కూల్ పీడీ ఎండీ అబ్దుల్లా స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. 21జతల డ్రెస్‌లు, పాఠ్యపుస్తకాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. జీహెచ్ఎం శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : కడ్తాల గ్రామ పంచాయతీ తైబజార్ వేలం జీపీ కార్యాలయంలో ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి సుజాత అధ్యక్షతన వేలం నిర్వహించగా ముగ్గురు డిపాజిట్‌దారులు పాల్గొన్నారు. 2025-26 సంవత్సరానికిగాను రూ.9,07,750 తైబజార్ వేలాన్ని ప్రభుత్వ నిర్ణయించింది. రూ.9,08,500లకు కడ్తాలకు చెందిన జి.రామచంద్రయ్య వేలాన్ని దక్కించుకున్నాడు.

కడ్తాల్ : సేవలను బట్టే సమాజంలోకీర్తి లభిస్తుందని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని వెంకటేశ్ సందర్శించారు. నాయకులతో కలిసి ప్రయాణికులకు, ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులున్నారు.

షాద్‌నగర్ అర్బన్ : విశ్రాంత ఉద్యోగులైన కళాకారులను సన్మానించారు. ఇటీవల కోదాడలో నిర్వహించి రాష్ట్రస్థాయి కళా ప్రదర్శనలో పాల్గొన్ని ప్రతిభ చాటిన కళాకారులను షాద్‌నగర్ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సన్మానించారు. సన్మానం పొందిన కళాకారులైన శ్రీనివాస్, జి. చెన్నయ్య, ఎ. నర్సింహులగౌడ్, ఎన్. వాణిక్యం, కె. సత్యనారాయణలు ఉన్నారు. రామారావు, ఎస్. జగదీశ్వర్, బండారి రమేష్, స్వరాజ్‌బాబున్నారు.

శంషాబాద్ రూరల్ : ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోతుంటే అధికారులు స్పందించడం లేదని మండల కన్వీనర్ ప్రణయ్ అన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా అధికారులు కాపాడాలని సీపీఎం ఆధ్వర్యంలో డీటీ వినతిపత్రం అందించారు. సీరటి మల్లేశ్, ఏపూరి పవన్‌కుమార్, జె.సామిల్ తదితరులున్నారు.

షాద్‌నగర్ : శ్రీరాముడు అందరి వాడేనని, ప్రతీఒక్కరికి ఆదర్శనీయుడని అఖిలపక్ష నాయకులు వ్యాఖ్యానించారు. షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి గీతా మందిరంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీరామ శోభాయాత్ర పోస్టర్‌ను ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, వీహెచ్‌పీ నేత రమేష్ ఆవిష్కరించారు.

శంషాబాద్ రూరల్ : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. తొండుపల్లి 11వ వార్డు నేషనల్ హైవే బ్రిడ్జిపై సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు కొండ పరమేశ్‌గౌడ్ రూ.40వేలు సీఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరా వినాయక్‌కు అందించారు.

చేవెళ్ల : మున్సిపల్ కార్యాలయంలో అధికారులు తైబజార్ వేలం నిర్వహించారు. పలువురు పోటీపడగా.. చేవెళ్లకు చెందిన బేగరి శ్రీనివాస్ రూ.11లక్షల 20వేలకు వేలం దక్కించుకున్నారు.

న్యాయవాది హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి



నివాళులర్పిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది ఇజ్రాయెల్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. హత్యకు గురైన న్యాయవాది ఇజ్రాయెల్ కుటుంబసభ్యులను శుక్రవారం తుమ్మలూరులో పరామర్శించిన అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చంద్రయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్, వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, జంగయ్య, రాజు, గోవర్ధన్ తదితరులున్నారు.

మహిళా అధికారులకు సన్మానం



షాద్‌నగర్ అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో రాణిస్తున్న మహిళా అధికారులను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కన్స్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్రతినిధులు సన్మానించి, అభినందనలు తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆర్డీవో సరిత, మున్సిపల్ కమిషనర్ సునిత, డీడీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, ఆర్టీసీ డీఎం ఉష, సీడీపీవో షబానా, ఎస్ఐ సుశీలలను సన్మానించి, జ్ఞాపికలు అందించారు. సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి భీమిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.ప్రవీణ, జాయింట్ సెక్రటరీ వెంకన్నబాబులు పాల్గొన్నారు.

ప్రతీ కూలీకి 'ఉపాధి' కల్పిస్తాం

యాచారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో ప్రతీ కూలీకి ఉపాధి కల్పించి ఆదుకుంటామని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తక్కళ్లపల్లి, యాచారంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఫాంపాండ్ పనులు పూర్తిచేయాలని, భూగర్భజలం పెరుగుతుందని కూలీలకు సూచించారు. ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులున్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తనీయొద్దు

యాచారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎండలు ముదురుతుండడంతో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు రవీందర్, ప్రధానకార్యదర్శి కృష్ణలు ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి సమర్పించిన వినతిపత్రంలో కోరారు. గ్రామాల్లో చేతి పంపులు లేవని, భగీరథ నీటిని సరఫరా చేయించాలని కోరారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కడ్తాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నేడు(శనివారం) మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల మండలంలో ఏప్రిల్ 2న ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు పరమేశ్ తెలిపారు.

'మున్సిపల్ సిబ్బంది నాపై కక్ష కట్టారు'

కొత్తూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బంది తన హోటల్‌పై కక్ష కట్టి ఆకస్మిక తనిఖీలంటూ జరిమానాలు విధిస్తున్నారని స్థానిక బావర్చి హోటల్ యజమాని ఇర్ఫాన్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తూర్ వైజంక్షన్ పరిసరాల్లో ఎన్నో హోటళ్లు ఉన్నాయని, తరచూ తన హోటల్‌పైనే మున్సిపల్ సిబ్బంది తనిఖీలు చేస్తున్నామంటూ, తినుబండారాలు పరిశీలించి జరిమానాలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు. సీడీఎంఏ ఆదేశాల మేరకు అన్ని హోటళ్లలో తనిఖీలు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. ఎటువంటి పక్షపాతం లేకుండా గురు, శుక్రవారాల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అండేకార్ యాదిలాల్



ఆమనగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది, మాజీ అధ్యక్షుడు లక్ష్మణశర్మ పర్యవేక్షణలో ఆమనగల్లు కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదులు సమావేశమై బార్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన అండేకార్ యాదిలాల్, ఉపాధ్యక్షుడిగా ఎ.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దుడ్డు అంజనేయులు యాదవ్, సంయుక్త కార్యదర్శి ఎం.విజయ్‌కుమార్, కోశాధికారిగా కొప్పు కృష్ణ, లైబ్రేరియన్‌గా వస్పుల మల్లేశ్‌లు ఎన్నికయ్యారు. నూతన బార్ అసోసియేషన్ కమిటీకి ఎన్నిక పత్రాన్ని అందజేసి అభినందించారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణశర్మ, జగన్, మల్లేశ్‌గౌడ్, సుదాకర్ రెడ్డి, కృష్ణయ్య, వెంకట్ గౌడ్, మల్లేశ్, శ్రీను, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి



నియామకపత్రం అందుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మామిడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రెడ్డిపల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి శుక్రవారం రాజేంద్రనగర్ కోర్టులో నియామక పత్రాన్ని అందుకున్నారు. అధ్యక్షుడిగా కాసోజు యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బందయ్య, సంయుక్త కార్యదర్శిగా జ్ఞానేశ్వర్‌చారి, మహిళా కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా లక్ష్మయ్య, లైబ్రేరియన్‌గా అమృత్‌రెడ్డి, స్పోర్ట్స్ కార్యదర్శిగా కిరణ్, కార్యవర్గ సభ్యులుగా భగీందర్‌సింగ్, యశ్వంత్, మహేందర్‌రెడ్డి, రాజు, రమేష్‌లు నియమించబడ్డారు.